ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర

సంపుటి : 13
సంచిక : 289

పేజీలు : 5 వెల రూ. 2/-

శుక్రవారం
21 నవంబర్ 2025

PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

## ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపిన కమిషనర్ పోలీస్ వి. సి. సజ్జనర్..

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ : బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ విశ్వనాథ్ చెన్నప్ప సజ్జనార్ ని వారి ఛాంబర్ లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు జూబ్లీహిల్స్ నియోజకవర్గ నూతన ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్. ఈ సందర్భంగా సీ.పి. సజ్జనార్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ను అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.



## బీహార్ సిఎంగా నితీశ్ ప్రమాణం

- 27మంది మంత్రులు కూడా ప్రమాణం
- ప్రమాణం చేయించిన గవర్నర్
- హాజరైన మోడీ, అమిత్ షా, చంద్రబాబు


2 లో

## దేశవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ

- కేంద్రమంత్రికి సిఎం రేవంత్ సూచన - పరిశీలిస్తామన్న మంత్రి ప్రహ్లాద్ జోషి


2 లో


### 10వ తరగతి
## ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం

- బండి సంజయ్‌పై కేసు కొట్టివేసిన హైకోర్టు
- మరో కేసులో నాంపల్లి కోర్టుకు హాజరైన బండి


2 లో

## ఫిరాయింపు ఎమ్మెల్యేపై విచారణ

- పోచారం, అరికెపూడిలతో ముగింపు
- దానం, కడియంలకు మరోమారు నోటీసులు..


2 లో

### గవర్నర్లు, రాష్ట్రపతికి
## గడువు విధించలేం

- గవర్నర్లకు మూడు అంశాల్లోనే నిర్ణయం
- సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు


2 లో

## దేవుళ్ల పేరుతో సినిమాలు తీస్తావ్

- నమ్మకం లేదంటావా రాజమౌళి
- మండిపడ్డ ఎమ్మెల్యే రాజాసింగ్


2 లో

## కేటీఆర్‌కు బిగ్ షాక్

- ఫార్ములా -కారు రేసు కేసు విచారణకు గవర్నర్ అనుమతి


2 లో

# గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు విధించలేం

ఏఎం న్యూస్, న్యూఢిల్లీ,నవంబర్20:
గవర్నర్,రాష్ట్రపతి అధికారాలపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. పెండింగ్ బిల్లుల ఆమోదానికి సంబంధించిన అంశంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించటం తగదని స్పష్టం చేసింది. కారణం చెప్పకుండా గవర్నర్‌లు బిల్లులను వెనక్కి పంపలేరని తెలిపింది. బిల్లును నిరవధికంగా నిలిపివేసే అధికారం గవర్నర్లకు లేదని కూడా తేల్చి చెప్పింది. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి పంపితేనే రాష్ట్రపతి చర్యలు తీసుకోగలరని చెప్పింది. ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్లకు విచక్షణాధికారం ఉందని వెల్లడించింది. తన ముందుకు వచ్చిన బిల్లులను గవర్నర్ రాష్ట్రపతికి పంపడం, అభిప్రాయాలతో తిరిగి పంపడం, బిల్లును పరిశీలించి సూచనలు ఇవ్వడం వంటివి మాత్రమే చేస్తారని తెలిపింది. రాష్ట్ర పరిపాలనలో తుది అధికారం ఎన్నుకోబడిన మంత్రివర్గానిదేనని స్పష్టం చేసింది. ఒక రాష్ట్రంలో రెండు ఎగ్జిక్యూటివ్ పవర్స్ ఉండవని, ప్రభుత్వం ఒక్కటే ప్రధాన నిర్ణయాధికారి అని తేల్చి చెప్పింది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులకు ఆమోదం తెలిపే విషయంలో న్యాయస్థానం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించటంపై ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పంపిన ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌పై స్పందిస్తూ సుప్రీంకోర్టు ఈ తీర్పును వెలువరించింది. రాష్‌టర శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే అంశంలో సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము సంధించిన ప్రశ్నలపై అత్యున్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది. పెండింగ్ బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువులు విధించడం తగదని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టంచేసింది. అయితే, కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులను వెనక్కి పంపలేరని వెల్లడించింది. ఈ మేరకు దీనిపై గతంలో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీజేఐ ధర్మాసనం పక్కనపెట్టింది. గవర్నర్లకు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయి. బిల్లులకు సమ్మతి తెలియజేయడం, కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం, బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి పంపడం. ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారు. ఇందుకు న్యాయస్థానాలు గడువు విధించడం సబబు కాదని అభిప్రాయపడ్డారు. గవర్నర్ల విధుల నిర్వహణ వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవు. కానీ, కారణం లేకుండా దీర్ఘకాలంగా బిల్లులను పెండింగ్‌లో ఉంచిన సందర్భాల్లో కోర్టులు పరిమిత విచక్షణతో వ్యవహరించొచ్చు. రాష్ట్రపతి విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. నిరవధిక ఆలస్యం కొనసాగుతున్న సందర్భాల్లో అది న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని తెలిపారు. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి రిజర్వ్ చేసిన ప్రతిసారీ ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి సుప్రీంను సంప్రదించాల్సిన అవసరం లేదు. ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు విచక్షణాధికారం ఉంటుంది. అయితే, దాన్ని అపరిమితంగా వినియోగించలేరు. శాసనసభలు ఒకటికి రెండుసార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమా, తిప్పి పంపించడమా చేయాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం నిర్దేశించింది. దీంతో రాజ్యాంగ అధికరణం 143(1) ప్రకారం తనకున్న అధికారాన్ని వినియోగిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మే నెలలో పలు ప్రశ్నలపై సీజేఐకి లేఖ రాశారు. రాష్ట్రపతి విచక్షణ అధికారాల పరిధిలోకి వచ్చే రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలిపే అంశంలో న్యాయస్థానం గడువు విధించడం ఎంతవరకు న్యాయ సమ్మతమో తెలపాలంటూ సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. దీనిపై సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. పది రోజుల పాటు అన్ని పక్షాల వాదనలు ఆలకించిన ధర్మాసనం సెప్టెంబరు 11న తీర్పు రిజర్వు చేసింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించలేమంటూ తాజాగా తీర్పు వెలువరించింది.

# కేటీఆర్‌కు బిగ్ షాక్

ఏఎం న్యూస్, హైదరాబాద్,నవంబర్20:
మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు బిగ్ షాక్ తగిలింది. ఈ ఫార్ములా -కారు రేసు కేసుకు సంబంధించి ఆయనపై విచారణ చేపట్టేందుకు గవర్నర్ అధికారికంగా అనుమతి మంజూరు చేశారు. ఈ కేసులోనిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగించేం దుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గవర్నర్ అనుమతితో ఏసీబీ త్వరలోనే కేటీఆర్‌పై చార్జ్‌షీట్ దాఖలు చేయనుందని సమాచారం. ప్రభుత్వం ఈ విషయంలో లేఖ రాయడంతో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించారు. ఈ కేసులో ఇప్పటికే పలుమార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరుతూ గతంలో ఏసీబీ లేఖ రాసింది. ఆయన పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ అందులో పేర్కొంది. ఈక్రమంలో తాజాగా ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో త్వరలోనే ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయనుంది. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ-1 గా, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను ఏ-2గా ఏసీబీ పేర్కొంది. ఇప్పటికే కేటీఆర్ ఈ కేసు విషయంలో ఏసీబీ విచారణకు నాలుగు సార్లు హాజరయ్యారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ విషయంలో తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులు ఇప్పటికే కేంద్రంలోని డీఓపీటీకు లేఖ రాశారు. గవర్నర్ అనుమతి నేపథ్యంలో, చార్జ్‌షీట్ దాఖలుకు ముందు ఏసీబీ అధికారులు మరోసారి కేటీఆర్‌ను లేదా ఇతర కీలక వ్యక్తులను విచారించే అవకాశం ఉంది. ఈ కేసుపై గవర్నర్ అనుమతి లభించడంతో, రాజకీయ వర్గాలలో, పరిపాలనా వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ త్వరలో దాఖలు చేయబోయే చార్జ్‌షీట్‌తో ఈ కేసు విచారణ కీలక మలుపు తిరగనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో క్విడ్ ప్రోకో జరిగినట్టు ఏసీబీ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. రూ.54.88 కోట్ల నిధులు దారి మళ్లింపుపై ఆరోపణలు చేసింది. ఇక, 2024లో ఫార్ములా ఈ-కారు కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కార్ రేస్ వ్యవహారంలో 2024 డిసెంబర్ నెలలో ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కేసు విచారణలో భాగంగా ఇప్పటికే కేటీఆర్‌ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను 3 సార్లు ఏసీబీ అధికారులు విచారించారు. తాజాగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. కేసుకు సంబంధించిన నివేదికను అవినీతి నిరోధక శాఖ( ఏసీబీ) అధికారులు మంగళవారం తెలంగాణ ప్రభుత్వానికి అందించారు. ప్రాసిక్యూషన్ అనుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో కేటీఆర్‌ను ఈ కేసులో ఏ1గా పేర్కొంటూ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఫార్ములా- ఈ కార్ రేసు నిర్వహణ కోసం యూకేకు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్, ఏస్ నెక్ట్స్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ పురపాలకశాఖ 2022 అక్టోబరు 25న ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం కార్ రేస్ నిర్వహణకు అయ్యే ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ భరించాలి. అలాగే కార్ రేసు నిర్వహణకు వీలుగా తెలంగాణ పురపాలక శాఖ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. అందులో భాగంగా 2023 ఫిబ్రవరి 11 జరిగిన రేస్ కోసం తెలంగాణ పురపాలక శాఖ తరుపున హెచ్ఎండీఏ రూ.12 కోట్లు ఖర్చు చేసింది. రేసు నిర్వహణ ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్ జెన్ భరించింది.

# అరుదైన ఆపరేషన్ చేసి బాలుడికి పునర్జన్మ ఇచ్చిన గాంధీ వైద్యులు

### - గాంధీలో 7 ఏళ్ల బాలుడికి ల్యాపరోస్కోపిక్ స్ప్లీనెక్టమీ విజయవంతం
### - కిలోకు పైగా బరువు ఉన్న ప్లీహం తొలగింపు



ఏ ఎం న్యూస్ / హైదరాబాద్ :
సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో తొలిసారిగా 7 ఏళ్ల బాలుడికి ల్యాపరోస్కోపిక్ విధానంలో ప్లీహము తొలగించే శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. పీడియాట్రిక్ సర్జరీ విభాగం ప్రొఫెసర్,హెచ్ఓడీ డాక్టర్ నాగార్జున ఆధ్వర్యంలో ఈ శస్త్రచికిత్స జరిగింది. మంచిర్యాల జిల్లా అకినేపల్లి గ్రామానికి చెందిన సూర అఖిల్ అనే బాలుడు పుట్టకతోనే రక్తవ్యాధి హెరిడిటరీ స్ఫిరోసైటోసిస్ తో బాధపడుతున్నాడు. మూడు నెలల వయసు నుంచే వ్యాధి లక్షణాలు కనిపించాయి. ప్లీహము పెరగడం, జాండీస్, తీవ్ర రక్తహీనతతో బాధపడుతూ ప్రతి వారం రక్త మార్పిడి అవసరమయ్యేది. ల్యాపరోస్కోపిక్ స్ప్లీనెక్టమీ చాలా క్లిష్టమైన శస్త్రచికిత్స. రక్తస్రావం ప్రమాదం ఎక్కువగా ఉండడం, ఓపెన్ సర్జరీకి మార్చాల్సిన పరిస్థితులు రావడం, ఖర్చులు అధికం కావడం వంటి కారణాలతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా ఇది అరుదుగానే చేస్తారు. పలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్ళినప్పటికీ ప్రయోజనం లేకపోవడం, ఖర్చు అధికంగా అవుతుండటంతో తండ్రి రవి గాంధీ ఆసుపత్రికి తన కుమారుడిని తీసుకువచ్చి, అడ్మిట్ చేయించారు. అయితే గాంధీ ఆస్పత్రి వైద్యులు ఈ శస్త్ర చికిత్సను పూర్తిగా ఉచితంగా విజయవంతంగా పూర్తి చేశారు. క్లిష్టమైన ఓపెన్ సర్జరీ కాకుండా, ల్యాపరోస్కోపిక్ విధానంలో కడుపుకు నాలుగు చోట్ల రంధ్రాలు చేసి, అందులోనుంచి ప్లీహాన్ని చిన్న,చిన్న ముక్కలుగా చేసి, బయటకు తీశారు. భవిష్యత్ లో ప్లీహం లేని కారణంగా వ్యాధి నిరోదక శక్తి సన్న గిల్లకుండా, వ్యాక్సిన్ లు వేశారు. ఈనెల 6న సర్జరీ విజయవంతంగా చేశారు. శస్త్రచికిత్సలో డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, డాక్టర్ పవన్ రావు,డాక్టర్ అశ్రిత్ రెడ్డి, డాక్టర్ హర్ష, డాక్టర్ సాజిద్ పాల్గొన్నారు. అనస్తీషియా విభాగం నుంచి ప్రొఫెసర్ డాక్టర్ అవుల మురళి, డాక్టర్ బబిత కీలక సహకారం అందించారు. శస్త్రచికిత్స విజయవంతానికి ఆపరేషన్ థియేటర్ సిబ్బంది సిస్టర్ అరుణ, వార్డు సిబ్బంది సిస్టర్ సువర్ణ సహకరించారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి సంబంధిత వైద్యులను అభినందించారు. దాదాపు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో దాదాపు రూ.10లక్షలకు పైగా ఖర్చు అయ్యే ఈ సర్జరీని గాంధీ లో ఉచితంగా చేశామని,



కోలుకున్న బాలుడు అఖిల్‌ను డిశ్చార్జీ చేస్తున్నట్లు తెలిపారు. ఈసం దర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా అత్యాధునిక, క్లిష్టమైన శస్త్ర చికిత్సలు చేసేందుకు గాంధీ ఆస్పత్రి పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంది. పేద, వెనుకబడిన పిల్లలకు కూడా ప్రపంచ స్థాయి చికిత్స అందిస్తున్నాం" అని తెలిపారు. వైద్య రంగానికి సీఎం రేవంత్ రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా లు ప్రత్యేక చొరవ తీసుకుంటూ, వైద్య రంగం బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. తమ కుమారుడికి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆపరేషన్ చేసి, కాపాడిన గాంధీ డాక్టర్లకు తండ్రి రవి కృతజ్ఞతలు తెలిపారు. డబ్బులు లేని తమలాంటి వారికి గాంధీ ఆసుపత్రి గొప్ప వరమని అన్నారు. కార్యక్రమంలో పీడియాట్రిక్ ప్రొఫెసర్ డా.జార్జ్,ఆర్ఎంవో లు డా.శేషాద్రి, డా.కళ్యాణ చక్రవర్తి,డా.యోగేందర్,సిబ్బంది పాల్గొన్నారు.

# అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నిజాం కళాశాల MCA విభాగ HOD రాందాస్ నాయక్ అసభ్య ప్రవర్తనపై ఆందోళన

ఏ ఎం న్యూస్ ఓయూ:



స్త్రీ శక్తి దివస్ సందర్భంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న సెమినార్‌కు MCA విద్యార్థులను ఆహ్వానించడానికి వెళ్లిన ఏబీవీపీ కార్యకర్తలపై, అలాగే భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో అపూర్వ స్థానాన్ని కలిగిన ఝాన్సీ లక్ష్మీబాయి వంటి మహనీయ నాయికపై MCA విభాగాధిపతి ప్రొఫెసర్ రాందాస్ నాయక్ అసభ్యకరంగా, అతి నీచంగా వ్యాఖ్యానించడానికి ఏబీవీపీ ఖండించింది ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ %-% నిజాం కళాశాల యూనిట్ ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్ గారికి వినతిపత్రం సమర్పించారు. ప్రొఫెసర్ రాందాస్ నాయక్‌పై వెంటనే విచారణ ప్రారంభించి, ఆయనను తక్షణమే సస్పెండ్ చేయాలని, అలాగే భవిష్యత్తులో విద్యార్థులపై, కార్యకర్తలపై ఎవరైనా అధ్యాపకులు అసభ్య భాష వాడకుండా కఠిన మార్గదర్శకాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రతినిధులు పేర్కొంటూ, "ఝాన్సీ లక్ష్మీబాయి వంటి స్వాతంత్ర్య సమర యోధురాలపై వ్యాఖ్యలు చేయడం కేవలం వ్యక్తిగత అవమానమే కాదు, దేశ గౌరవాన్ని దెబ్బతీయడమే. విద్యార్థులను సెమినార్‌కు ఆహ్వానించడానికి వెళ్లిన మా కార్యకర్తలను అవమానించడం పూర్తిగా అంగీకారయోగ్యం కానిది," అన్నారు. ఈ ఘటనపై కళాశాల వాతావరణంలో ఉద్రిక్తత నెలకొనగా, విద్యార్థి సంఘాలు ప్రొఫెసర్‌పై సరైన చర్యలు తీసుకునే వరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతాయని ఏబీపీ హెచ్చరించింది

# ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో జరిగిన ఎన్నికల్లో BRTU యూనియన్ పై11 ఓట్ల తేడాతో బిఎంఎస్ విజయం

ఏ ఎం న్యూస్ ఓయూ:



ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో జరిగిన ఎన్నికల్లో BRTU యూనియన్ పై11 ఓట్ల తేడాతో బిఎంఎస్ విజయం సాధించింది దాని సందర్భంగా ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ ని కలవటం జరిగింది BMS మిటీ సభ్యులకుకమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసినారు గెలుపొందిన ప్యానల్ సభ్యుల వివరాలు అడ్వైజర్, చెన్నకేశవరావు, అధ్యక్షులు ఏ రాము జనరల్ సెక్రెటరీ కోటేశ్వరరావు వైస్ ప్రెసిడెంట్ దశరథ్, వై శ్రీనివాస్ పి సంపత్ డి యాదగిరి పి హరి ప్రసాద్ జాయింట్ సెక్రెటరీ ఎం చంద్రమౌళి ప్రకాష్ రామాంజనేయులు, కొమురయ్య ఆర్గనైజింగ్ సెక్రెటరీ బి వాసుదేవులు ఏం ఆగయ్య బాలరాజు శంకర్ ప్రవీణ్ కుమార్ ట్రెజరస్ మహేష్ వెంకటేశం కమిటీ మెంబర్స్ యాదగిరి ఎస్సీ భారీ ఉమేష్ శ్వర్ మహిళా సెక్రెటరీ అనురాధ రమ మహేశ్వరి పి సుశీల ఎం శ్యామల కృష్ణకుమారి కే నాగమణి ప్యానల్ గెలుపు పొందటం జరిగింది జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ అసెంబ్లీ కన్వీనర్ బాలచందర్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ జరుపుకోవడం జరిగింది.



# బీహార్ సీఎంగా నితీశ్ ప్రమాణం

ఏఎం న్యూస్, పాట్నా,నవంబర్ 20:




బిహార్ సీఎంగా జేడీయూ అధినేత నితీశ్ కుమార్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. సీఎంగా ఆయన ప్రమాణస్వీకారం చేయడం ఇది పదోసారి. పట్నాలోని గాంధీ మైదానంలో నితీశ్‌తో పాటు 27 మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేయగా.. సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హాలకు డిప్యూటీ సీఎం పదవులు దక్కాయి. గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ సీఎం, మంత్రులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అదరగొట్టింది. మొత్తం 243 అసెంబ్లీ సీట్లకు నితీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్డీయే ఏకంగా 202 సీట్లు దక్కించుకుంది. బీజేపీ 101 సీట్లలో పోటీ చేసి 89 చోట్ల గెలుపొందింది. 101 సీట్లలోనే పోటీ చేసిన జేడీయూ 85 చోట్ల విజయం సాధించింది. తాజాగా ప్రమాణస్వీకారం చేసిన 27 మంత్రుల్లో.. 14 మంది బీజేపీ నుంచి కాగా, 9 మంది జేడీయూకు చెందిన నేతలు. బిహార్‌లో సీఎం నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లు పదవిలో ఉన్నారు. 2000 సంవత్సరంలో ఏడు రోజులు మాత్రమే సీఎంగా పని చేశారు. ఇప్పుడు ఎన్డీయే కూటమి మళ్లీ ఆయనకే పగ్గాలు అప్పగించడంతో పదోసారి సీఎంగా ప్రమాణం చేశారు. పదోసారి బిహార్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. నితీశ్ రాజకీయంలో ఎంతో అనుభవం ఉన్న నాయకుడు. రాష్ట్రంలో మంచి పాలన అందించిన వ్యక్తి అనే అద్భుతమైన రికార్డు ఆయనకు ఉందని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.

# దేశవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ

ఏఎం న్యూస్, హైదరాబాద్,నవంబర్20:
దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల్లో వినియోగదారులకు సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. గురువారం ఉదయం హోటల్ తాజ్‌కృష్ణలో కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి రేవంత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు తినే బియ్యాన్ని సరఫరా చేస్తేనే సంక్షేమ పథకం ఉద్దేశం నెరవేరుతుందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలాగే కేంద్రం కూడా దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ అంశాన్ని పరిశీలించాలని కేంద్రమంత్రి కోరారు. అవసరమైతే అధ్యయనం చేసి తగు నిర్ణయం తీసుకోవాలని వినతి చేశారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. పూర్తిస్థాయి అధ్యయనం తర్వాత పరిశీలించి దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణిపై నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 10వ తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం

ఏఎం న్యూస్, హైదరాబాద్,నవంబర్ 20:
కేంద్ర హోమ్ శాఖ మంత్రి బండి సంజయ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. గతంలో కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును గురువారం నాడు హైకోర్టు కొట్టేసింది. 2023లో 10వ తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై ఈ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇందులో బండి సంజయ్ పేరును ప్రధాన నిందితుడిగా కమలాపురం పోలీసులు చేర్చారు. రాజకీయ కక్షల కారణంగానే ఈ కేసు నమోదు చేశారని హైకోర్టుకు బండి సంజయ్ న్యాయవాది తెలిపారు. కేసు నమోదులో సరైన సెక్షన్లు కానీ.. దర్యాప్తులో పూర్తి వివరాలు కానీ లేవని హైకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ కేసును కొట్టేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలావుంటే బండి సంజయ్ గురువారం నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. గతంలో తనపై నమోదైన పలు కేసుల నేపథ్యంలో విచారణ కోసం కోర్టు వెళ్లారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ పని చేసిన విషయం తెలిసిందే.ఆ సమయంలో నల్గొండలోని వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అలాగే హుజూర్‌నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల లో బండి సంజయ్ కాన్వాయ్‌పై బీఆర్ఎస్ నేతలు రాళ్ల దాడి చేశారు. నాటి ఘటనల్లో బండి సంజయ్‌పై పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల విచారణలో భాగంగానే కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. అయితే, విచారణ అనంతరం జనవరి 7వ తేదీకి ఈ కేసును న్యాయమూర్తి వాయిదా వేశారు.

# దేవుళ్ల పేరుతో సినిమాలు తీస్తావ్

ఏఎం న్యూస్, హైదరాబాద్,నవంబర్ 20:
రాజమౌళి ప్రతి సినిమాను హిందూ సమాజం బహిష్కరించాలని ఎమ్మెల్యే రాజాసింగ్ పిలుపునిచ్చారు. ఇటీవల ఓ ఈవెంట్‌లో భాగంగా రాజమౌళి చేసిన వ్యాఖ్యలపై తాజాగా రాజాసింగ్ స్పందించారు. ప్రస్తుతం డైరెక్టర్ రాజమౌళికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోందన్నారు.. తన అమ్మానాన్నలకు హనుమంతుడిపై విశ్వాసం ఉంది కానీ.. తనకు లేదని రాజమౌళి అన్న మాటలను రాజాసింగ్ గుర్తు చేశారు. నీకు విశ్వాసం లేదు కానీ.. అదే ధర్మం, దేవుళ్లపై సినిమాలు చేసి.. రూ. కోట్లల్లో సంపాధించుకున్నావు కదా..? అని ప్రశ్నించారు. అసలు నీ ప్లాన్ ఏంది..? ఇప్పుడు వారణాసి పేరుతో మహేష్‌బాబును పెట్టి మరో సినిమా తీస్తున్నావ్.. ఈ మూవీ ప్రమోషన్‌లో భాగంగా ఈ వ్యాఖ్యలు చేశావా? అని నిలదీశారు. లేదా నువ్వు నిజంగానే నాస్తికుడివా..? ఓ సారి డిక్లెర్ చేయ్యాలని డిమాండ్ చేశారు. అసలు నీ తప్పేం లేదు.. అసలు తప్పు హిందులదే అన్నారు. నీలాంటి నీఛపు డైరెక్టర్లను హిందువులు కనుగొనలేక పోతున్నారన్నారు. ధర్మం పట్ల, హిందూ దేవుళ్ల పట్ల నమ్మకం లేని రాజమౌళి సినిమాలు హిందువులు ఎందుకు చూడాలని రాజాసింగ్ నిలదీశారు. 'బాహుబలి సినిమా తీశావు.. ప్రభాస్‌తో శివలింగాన్ని ఎత్తించావు.. కోట్ల రూపాయలు సంపాధించుకున్నావు.. మళ్లీ మా హిందు దేవుళ్లపై నమ్మకం లేదని చెబుతున్నావు. రాజమౌళికి ఇది కొత్తేం కాదు.. భగవాన్ శ్రీకృష్ణుడికి చెందిన 16 వేల మంది దాసులను, లవర్స్ అంటూ హేళన చేశాడు. నాకు రాముడిపైన ఇష్టం లేదు.. రాముడి స్టోరీ బోరింగ్ స్టోరీ అని గతంలో ట్వీట్ చేశాడు. ఇప్పుడు హనుమంతుడిపైన కామెంట్స్ చేశాడు.. హిందువులకు ఓ సూచన.. ఇలాంటి డైరెక్టర్లపై కంప్లేంట్ ఇవ్వండి. ఇలాంటి వ్యక్తులను జైల్లో వేస్తేనే హిందూ దేవుళ్లపై కామెంట్స్ చేస్తే ఏం జరుగుతుందో తెలుస్తుంది. ఇలాంటి పనికిరాని డైరెక్టర్ సినిమాలు చూడొద్దు.. మనం ఇలాంటి వ్యక్తులు తీసిన సినిమాలు చూస్తాం.. వాళ్లు వందలు వేల రూపాయలు సంపాధించుకుంటారు. ఇలా నాస్తికత్వం పేరుతో మన దేవుళ్లపై కామెంట్స్ చేస్తారు.. అందుకే ఈ డైరెక్టర్ సినిమాలు బ్యాన్ చేద్దాం..' అని రాజాసింగ్ వ్యాఖ్యానించారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేపై విచారణ

ఏఎం న్యూస్, హైదరాబాద్,నవంబర్ 20:
సుప్రీం మరో నాలుగు వారాల గడువు ఇవ్వడంతో పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ నోటీసులు జారీ చేశారు. గురువారం పోచారం శ్రీనివాసరెడ్డి, అరికెపూడి గాంధీలను విచారించారు. పదిమందిలో ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రం ఇప్పటి వరకు అఫిడవిట్‌లు దాఖలు చేయని పరిస్థితి. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి.. స్పీకర్ నోటీసులకు స్పందించని విషయం తెలిసిందే. దీంతో వారిరువురికి స్పీకర్ మరోసారి నోటీసులు జారీ చేశారు. అనర్హత పిటిషన్లపై అఫిడవిట్ దాఖలు చేయాలని అసెంబ్లీ స్పీకర్ స్పష్టం చేశారు. ఇక.. పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విచారణ గురువారంతో ముగిసింది. కేసు విచారణ ఆలస్యంపై సుప్రీం సీరియస్ అవడంతో పాటు నాలుగు వారాలు గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణలో వేగం పెంచాలని అసెంబ్లీ స్పీకర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా రెండో విడత విచారణలో భాగంగా నలుగురు ఎమ్మెల్యేలను విచారణకు పిలిచారు. ఉదయం ఎమ్మెల్యేల విచారణ మొదలైంది. పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్సెస్ జగదీశ్ రెడ్డి కేసును స్పీకర్ విచారించారు. ఇరు వర్గాల వాదనలను స్పీకర్ విన్నారు. అలాగే మధ్యాహ్నం అరికెపూడి గాంధీ వర్సెస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కేసు విచారించారు. వీరి విచారణతో మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేల విచారణ పూర్తి అవుతుంది. మరోవైపు ఎమ్మెల్యే దానం నాగేందర్ ఢిల్లీ వెళ్లారు. ఏఐసీసీ పెద్దలను కలవనున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ ముగియనున్నప్పటికీ ఇప్పటి వరకు దానం అఫిడవిట్లు దాఖలు చేయలేదు. విచారణకు హాజరైతే వేటు పడుతుందని దానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. వేటు పడితే ఆరు సంవత్సరాల పాటు పోటీ చేయడానికి నో ఛాన్స్. ఈ క్రమంలో రాజీనామా చేసేందుకు దానం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. రాజీనామా చేస్తే తన పరిస్థితి ఏంటని పార్టీ పెద్దలతో దానం సంప్రదింపులు జరుపనున్నట్లు తెలుస్తోంది.

# మీ సమస్యలు తెలియ జేయండి.. పరిష్కార చర్యలు చేపడతాం..

– టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :
స్థానికంగా మీ సమస్యలు తెలియ జేయండి, పరిష్కార చర్యలు చేపడతామనీ టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ అన్నారు. టి పి సి సి ఉపాధ్యక్షులు కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టి ఇంచార్జ్ బండి రమేష్ నియోజకవర్గం అభివృద్ధికి కృషిచేయడానికి ఆదర్శంగా తీర్చిదిద్దడానికి ప్రజల కోసం నిత్యం అందుబాటులో ఉంటు వారి సమస్యల పరిష్కారానికి మీ సమస్యలు తెలియ జేయండి, పరిష్కార చర్యలు చేపడతాం అని మీ కోసం బండి రమేష్ మీ ముందుకు వస్తున్నానని పేర్కొంటు గురువారం మొదట అల్లాపూర్ డివిజన్ లోని సద్దాఫ్ నగర్, రాజీవ్ గాంధీ నగర్ పలు బస్తిలలో స్థానిక నాయకులతో కలిసి నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. నీరు, పారిశుధ్యం విద్యుత్, ఏదయిన వేధింపులు, గంజాయి అరికట్టడం, లా అండ్



ఆర్డర్ సమస్యలు, భూకబ్జాలు, వంటి ముఖ్యమైన సేవలలో సమస్యలను పరిష్కరించడానికి పాదయాత్ర చేస్తు ఇంటింటికి తిరుగుతు సమస్యలు తెలుసుకుంటు ముందడుగు వేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల కోసం ప్రవేశ పెట్టిన పలు ప్రజాసంక్షేమ పథకాలను ప్రచారం చేస్తు ప్రజల సంక్షేమ కోసం తెలంగాణ లోని ప్రతి కుటుంబానికి, అన్ని వర్గాలకు, లబ్ధిపొందేల సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తామన్నారు. కాలనీల్లో సమస్యలు తెలుసుకోవడంతో పా టు, ప్రజల బాధలు వింటూ, తక్షణ పరిష్కార చర్యలు సమస్యల పై పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని బండి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమం లో రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులు, ప్రభుత్వ అధికారులు, జమీర్ భాయ్, షఫీ భాయ్ , లక్ష్మణ్ , మోయిజ్ భాయ్, విట్టల్ రెడ్డి ,బర్కతలి భాయ్ ,ఇలియాజ్ భాయ్ ,అడ్డు భాయ్, సాజన్ భాయ్, ఇస్మాయిల్ భాయ్ ,ఖాజా భాయ్ ,నజీర్ భాయ్ ,ముస్తఫా భాయి, షహేన్షా భాయ్, మస్తాన్ రెడ్డి అబ్దుల్లా భాయ్ ,కనకయ్య , కాలనీవాసులు, నేతలు, కార్యకర్తలు హాజరై మద్దతు తెలిపారు.

## లాలాపేట్ చౌరస్తాలోని ప్రజాకవి ఆంధ్ర శ్రీ దశదినకర్మ

ఏ ఎం న్యూస్ ఓయూ:



లాలాపేట్ చౌరస్తాలోని ప్రజాకవి ఆంధ్ర శ్రీ దశదినకర్మ కార్యక్రమంలో భాగంగా నివాళి అర్పించడం జరిగింది. అనంతరం ఘట్కేసర్ లోని డిజిఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగిన అందెశ్రీ సంస్కరణ సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ నగర కార్యదర్శి కుమార్ షాను తార్నాక డివిజన్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మున్నా అనిరుద్, మాజీ సికింద్రాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కిషోర్ యాదవ్, తార్నాక డివిజన్ కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ ఈ రవి మరియు వినోబా నగర్ యూత్ అసోసియేషన్ నాయకులు బోట్ల నరేష్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## బంజారాహిల్స్‌లో ఆర్కే ఫుడ్ హాస్పిటలిటీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న జనసేన నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్....

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



జూబ్లీహిల్స్ 10వ రోడ్ లో నూతనంగా ఆర్కే ఫుడ్ హాస్పిటలిటీ ప్రారంభమైంది. ప్రొపరేటర్ మచిలీపట్టణం జనసేన పార్టీ ఇంచార్జ్ రామకృష్ణ ఆహ్వానం మేరకు కూకట్‌పల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ శ్రీ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పాల్గొని రామకృష్ణకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు కొల్లా శంకర్, కలిగినీడి ప్రసాద్, పోలిబోయిన శ్రీనివాస్, పులగం సుబ్బు తధితరులు పాల్గొన్నారు.

## శ్రీ కాశీ విశ్వేశ్వర సహిత అన్నపూర్ణేశ్వరి దేవి నూతన ఆలయ అభివృద్ధికి ఐదు లక్షల విరాళం

దివంగత నేత మాధవరం పద్మారావు కుమారుడు మాధవరం శ్రీనాథ్ రావు అందజేత...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కూకట్ పల్లి వివేకానంద నగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర సహిత అన్నపూర్ణేశ్వరి దేవి నూతన ఆలయ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా కూకట్ పల్లి వాస్తవ్యులు దివంగత మాధవరం పద్మా రావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మాధవరం శ్రీనాథ్ రావు నూతన ఆలయ నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలను చెక్కు రూపంలో ఆలయ చైర్మన్ వద్దేపల్లి రాజేశ్వరరావు గురుస్వామికి అంద జేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ దైవ సేవలో భాగస్వామ్యం కావడం గొప్ప పుణ్యమనీ మాధవరం శ్రీనాథ్ కుటుంబం చేసిన ఈ మహత్తర విరాళం ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందనీ భక్తుల సహకారంతో దేవాలయాన్ని మరింత వైభవంగా రూపుదిద్దే దిశగా కృషి కొనసాగిస్తున్నాం అని అన్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులు సాఫల్యంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు రాజేశ్వరరావు తెలిపారు.

## శ్రీశ్రీశ్రీ అయ్యప్ప దేవాలయంలో ఎర్రవల్లి వాసుదేవరావు గురుస్వామి ఆధ్వర్యంలో భిక్షా కార్యక్రమం...


ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కూకట్‌పల్లి అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఆలయ చైర్మన్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి ఆధ్వర్యంలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమంలో భాగంగా గురువారం అయ్యప్ప స్వాములకు బిక్షను ఎర్రవల్లి వాసుదేవరావు గురుస్వామి సమర్పించారు. ఈ సందర్భంగా వద్దేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి స్వయంగా కార్యక్రమంలో పాల్గొని, వాసుదేవరావు స్వామితో కలిసి అయ్యప్ప భక్తులకు బిక్ష సమర్పించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు గురుస్వామి మాట్లాడుతూ "శ్రీ అయ్యప్ప స్వామివారిపై ఉన్న భక్తి, ఆరాధనతో వారి కోరిక మేరకు ఈరోజు బిక్ష సమర్పించే భాగ్యాన్ని వాసుదేవరావు పొందార నీ ఈ సేవ ద్వారా స్వామివారి కృపాకటాక్షాలు వారికి వారి కుటుంబానికి లభించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.

## శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో కార్తీకమాస చివరి రోజు ప్రత్యేక పూజలు...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కార్తీక మాస చివరి గురువారం అమావాస్య సందర్భంగా సాయిబాబ విశేష భక్తుడు కౌశిక్ గురువారం కూకట్‌పల్లి వివేకానంద నగర్ కాలనీలోని శ్రీ శిరిడీ సాయిబాబా మందిరంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కౌశిక్ ఆహ్వానం మేరకు ఆలయ చైర్మన్ వద్దేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి విచ్చేసి ప్రత్యేక పూజ, హారతి కార్యక్రమంలో పాల్గొని శ్రీ శిరిడీ సాయినాధుని దివ్యదర్శనం గావించారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే కార్యక్రమాలలో ప్రోటోకాల్ తప్పనిసరి

- ప్రోటోకాల్ ప్రకారం ఉన్న ముఖ్య అధికారి ప్రభుత్వం ఆ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ప్రతినిధులు తదితర శాఖల మంత్రుల ఫొటోలు ఉండాలి...
- బ్యానర్ రూపం ప్రదర్శిస్తూ సదరు కార్యక్రమాన్ని నిర్వహించే బాధ్యత అధికారులపై ఉంటుంది, అది రాజ్యాంగ పరమైన సూచిక...
- బాలనగర్ మండల అధికారులు తీరుపై టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ ఫైర్...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



టి పి సి సి ఉపాధ్యక్షులు కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టి ఇంచార్జ్ బండి రమేష్ కూకట్ పల్లి తహసిల్దార్ కార్యాలయంలో గురు వారం నియోజకవర్గంలోని లబ్ధిదారు లకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అంద చేసారు. ఈ సందర్భముగా తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం బాలనగర్ మండల అధికారుల తీరిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వ కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వ కార్యాలయాల్లో ఏదైనా జరిగితే అక్కడ ప్రోటోకాల్ ప్రకారం ఉన్న ముఖ్య అధికారి, ప్రభుత్వం, ఆ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ప్రతిని ధిలు, శాఖల మంత్రుల ఫొటోలు తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే ఆ కార్యక్రమానికి సంబం ధించిన వివరాలు తెలియజేస్తూ ఒక బ్యానర్ రూపం ప్రదర్శిస్తూ సదరు కార్యక్రమాన్ని నిర్వహించే బాధ్యత అధికారులపైన ఉందని, అది రాజ్యాంగ పరమైన సూచిక అని బండి రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగిరెడ్డి, పుష్ప రెడ్డి ,ప్రవీణ్, కృష్ణ రాజ్పుత్, అరవింద్ రెడ్డి, అప్పారావు, రంగస్వామి, జమీర్ ,రాజు, శివ చౌదరి, సంధ్య రజిత పాల్గొన్నారు.

## మంత్రి వివేక వెంకట్ స్వామితో రాష్ట అధ్యక్షుడు చైర్మన్ రియాజ్‌తో పాటు కె. ఉపేందర్ రెడ్డి

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :




ఎంతో ప్రతిష్టాత్మకంగా 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి, హాజరయ్యారు ఈ కార్యక్రమంలో స్టేట్ గ్రంథాలయ చైర్మన్ రియాజ్ పాల్గొన్నారు వారితో పాటు నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కె. ఉపేందర్ రెడ్డి హాజరు అయ్యారు ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రి వివేక్ వెంకట్ స్వామి కి శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపిక ను అందజేశారు రియాజ్. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ రంగ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న చైర్మన్‌లు, అధికారులు, గ్రంథాలయ ఉద్యోగస్తులు, విద్యార్థులు, సాహితీ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సభను ఉద్దేశించి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ జ్ఞానం ప్రతి మనిషి జీవితాన్ని వెలిగించే దీపమని, ఆ వెలుగును పంచేది గ్రంథాలయాలేనని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుస్తక ప్రియులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి..

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు కలెక్టర్ జిల్లా మెజిస్ట్రేట్‌గా నియమితులైన శ్రీమతి ఏ. తమీమ్ అన్సారియా ఐ.ఏ.ఎస్‌ని గురువారం మర్యాదపూర్వకంగా కలసి, శాలువాతో ఘనంగా సన్మానించి, పూల బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. డా. ఉండవల్లి శ్రీదేవి (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్పర్సన్).

## అట్లూరి రామకృష్ణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :




బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ( ప్రబారి ), అట్లూరి రామకృష్ణ పుట్టినరోజు గురువారం. ఈ పుట్టినరోజు కార్యక్రమం వేడుకలను ఘనంగా నిర్వహించారు వారి ( అట్లూరి రామకృష్ణ ) సన్నిహితులు అభిమానులు. ఈ పుట్టినరోజు వేడుకలకు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని భారతీయ జనతా పార్టీ వివిధ హెూదాల నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామ్ చందర్, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి తో పాటు జూటూరు కీర్తి రెడ్డి, డాక్టర్ పద్మ వీరపనేని, పాల్గొన్నారు ఈ పుట్టినరోజు వేడుకలకు వచ్చిన అందరూ ఎవరికి వారే ప్రత్యేక కేకులు తెచ్చి, వారిచే కట్ చేపించి, శాలువాతో ఘనంగా సన్మానించి అట్లూరి రామకృష్ణ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలలో పాల్గొన్న సరళ (అమీర్ పేట్ కార్పొరేటర్ ), అనంతలక్ష్మి ( శ్రీనగర్ కాలనీ డివిజన్ మహిళ అధ్యక్షురాలు ), కృష్ణమోహన్ రావు (తెలంగాణ బీసీ కమిషన్ మాజి చైర్మన్), నరేందర్ రెడ్డి, కొల్లి మధు( రాష్ట్ర అధ్యక్షుడు), అట్లూరి సుభాషిని, మాధవి రెడ్డి ( సినిమా ఆర్టిస్ట్ ) తో పాటు కుంభాల గంగరాజు, డి. ప్రేమ్ కుమార్ (జనరల్ సెక్రెటరీ ),కొండపల్లి మోహన్,తాత రవి, గూడూరు శ్రీధర్, గొంటి చంటి యాదవ్, పాల్గొన్నారు ఈ సందర్భంగా రామ్ చందర్ మాట్లాడుతూ చెరగని చిరునవ్వు, ఆత్మ విశ్వాసం క్రమశిక్షణ, నిజాయితీకి మారుపేరు అట్లూరి రామకృష్ణ అని అన్నారు. వందలాదిగా తరలి వచ్చిన ఆత్మీయుల మధ్య ఆత్మీయ సమావేశం ల ఈ పుట్టినరోజు వేడుకలు అంబరాన్ని అంటాయి.

## కండక్టర్స్‌కి, డ్రైవర్స్‌కి వాష్ రూమ్ ఏర్పాటు చేయండి : జి. మమత(220655)

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :




జి.మమత ( 220655)బర్కత్ పుర అనే నేను డి.ఎం. కి నమస్కరించి ఏమనగా కొల్లూరు డబల్ బెడ్ రూమ్ ఫేస్ 2 వద్ద గల బస్ స్టాప్ డ్యూటీ కి వెళ్లే కండక్టర్స్, డ్రైవర్స్ కి రెండు పడకల సముదాయం ఫేస్ టు ప్రాంగణంలో వాష్ రూమ్ వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది.గురువారం నేను జీ. మమత (220655)) వాష్ రూమ్ వెళ్లడానికి త్రీ బ్లాక్స్ తిరిగాను 15 నిమిషాల టైం పట్టింది. అక్కడ ఉన్నటువంటి ఒక ప్రయాణికుడు గుర్తుపట్టి వాళ్ళ మిస్సెస్ ని పిలిచి నా ప్రాబ్లం చెప్పడం జరిగింది. అక్కడికి వెళ్లి నా ప్రాబ్లం క్లియర్ చేసుకున్నాను. ప్రతిరోజు డ్రైవర్, కండక్టర్స్ కు ఇలాంటి ఇబ్బంది కలుగుతుంది . కావున కెసిఆర్ నగర్ ఫేస్ టు (2) వాష్ రూమ్ ఏర్పాటు చేయలని పై అధికారులకు ఏ.ఎం. న్యూస్ మీడియా ద్వారా విన్నవిస్తున్నాం. మా ప్రాంతానికి బస్సులు వేయండి అని అధికారులకు విన్నవిస్తున్న కొల్లూరు డబల్ బెడ్ రూమ్ (ఫేస్ 1,2,3) వాసులు మా గురించిన ( కండక్టర్స్ కి డ్రైవర్ కి )సమస్య ( టాయిలెట్) మీరు పట్టించుకొని అధికారులకు తెలియపరచాలని కోరుతున్నాం.

## ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : పద్మారావు గౌడ్

ఏ ఏం న్యూస్/ హైదరాబాద్ :



తహసిల్దార్ కార్యాలయం సేవలను నిరంతరం ప్రజలకు అందుబాటులో నిలపాలని, పేదల సమస్యలను వెన్వెంటనే పరిష్కరించాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ సూచించారు. మారేడుపల్లి నూతన తహసిల్దార్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన మహమ్మద్ అస్మతుల్లా ఖాన్ గురువారం సితాఫలమండీ లోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు పద్మారావు గౌడ్ తో మర్యాద పూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ ఏ ప్రలోభాలు, వత్తిళ్ళకు తలొగ్గకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. పేద ప్రజల సమస్యల వెన్వెంటనే పరిష్కరించాలని సూచించారు.

## తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ దీపక్ జాన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బోదాస్ నరసింహ..

ఏ ఎం న్యూస్ ఓయూ:



తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ దీపక్ జాన్ జన్మదిన సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన బోదాస్ నరసింహ,నరేష్, ఆంజనేయులు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.




## రాజీవ్ యువ వికాస్ పథకానికి నిధులు విడుదల చేయాలి

తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గద్ద యాదయ్య

ఏ ఎం న్యూస్ ఓయూ:
రాజీవ్ యువ వికాస్ పథకానికి చేయూతనిచ్చి నిధులు విడుదల చేయాలని తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గద్ద యాదయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాజీవ్ యువ వికాస్ పథకంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గద్ద యాదయ్య మాదిగ హాజరై మాట్లాడుతూ రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా యువతకు ఎంతో లబ్ధి చేకూరుతుందని అటువంటి పథకాన్ని ప్రారంభించకుండా నిధులు కేటాయించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. వెంటనే నిధులు కేటాయించి ప్రతి యువతకు రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఏకు తిరుపతి, కల్లేపల్లి లక్ష్మీనారాయణ, లాయర్ మల్లన్న, కొంద్రు పురుషోత్తం, బి ఎన్ రామచంద్రరావు, కళ్యాణి, కల్పన, విజయలక్ష్మి, ప్రకాష్, విజయ్ కుమార్, ప్రొఫెసర్ నతానియల్, హెచ్ ఆర్ మోహన్, తదితరు నాయకులు పాల్గొన్నారు.

## విలువలతో కూడిన జర్నలిజం చేస్తూ సమాజ పురోగతిలో భాగస్వాములమవుతాం..

ఓయ్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం....

ఏ ఎం న్యూస్ ఓయూ:
విలువలతో కూడిన జర్నలిజం చేస్తూ సమాజ పురోగతిలో భాగస్వాములమవుతామని ఓయ్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం స్పష్టంచేశారు. ఈ మేరకు బుధవారం ఓయూ లోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఓయూ తార్నాక ప్రింట్ మీడియా విలేకరులు సమావేశమై నూతనంగా ఉస్మానియా యూనివర్సిటీ తార్నాక ప్రెస్‌క్లబ్‌ను ప్రింట్ మీడియా ప్రతినిధులు ఏర్పరచుకుని కమిటీకి కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ గౌరవాధ్యక్షుడిగా కంచుకట్ల నందీశ్వర్ (వార్త), అధ్యక్షుడిగా రేగుంట వెంకటేశ్ (తెలుగు ప్రభ), ప్రధాన కార్యదర్శిగా అజయ్ కుమార్ సేగూరి (నమస్తే తెలంగాణ), ఉపాధ్యక్షులుగా వంగ సతీష్ రెడ్డి (దిశ), కె. సుధాకర్ (సాక్షి), కార్యనిర్వాహక కార్య దర్శిగా తులసీరామ్ (ఆంధ్రజ్యోతి), కోశాధికారిగా మాధవేని శ్రీనివాస్ (వాయిస్ టుడే), సలహా దారుగా ముదుసు కృష్ణమూర్తి (ఈనాడు), సభ్యులుగా రాజశేఖర్ (మన తెలంగాణ), తలారి శ్రీని వాస్ (నవ తెలంగాణ), ఎన్. వెంకటరమణ, క్రాంతి (ఆంధ్రప్రభ), శ్రవణ్ (ఆదాబ్ హైదరాబాద్), నరేష్ రెడ్డి (ఈనాడు)లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రింట్ మీడియా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడతామనీ చెప్పారు.

## చిలకలగూడ పోలీసులకు ఆరోగ్యం, ఆర్థిక, క్రమశిక్షణ తదితరు అంశాలపై శిక్షణ

ముగిసిన రెండు రోజుల ట్రైనింగ్ క్యాంప్

ఏ ఎం న్యూస్ / హైదరాబాద్ :



రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి, సిటీ కమిషనర్ సజ్జనార్ ఆదేశాల మేరకు చిలకలగూడ డివిజన్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు గురువారం రెండో రోజూ కొనసాగాయి. పోలీస్ సిబ్బందికి ఫైనాన్షియల్, సెల్ఫ్ డిసిప్లిన్, తదితర అంశాలపై ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ టీ.టీ. లిజేశ్, ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవడంపై న్యూ లైఫ్ వెల్‌నెస్ ట్రైనర్ ఎన్. పురుషోత్తం సూచనలు ఇచ్చారు. ఒక గొప్ప మార్పుకు ఇదే శ్రీకారం పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, అదనపు డీసీపీ నరసయ్య పర్యవేక్షించారు. పద్మారావునగర్ లోని సర్దార్ పటేల్ కాలేజీ లో జరిగిన శిక్షణ కార్యక్రమానికి ఏసీపీ శశాంక్ రెడ్డి, వారసిగూడ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి, లాలాగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, చిలకలగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మధు హాజరయ్యారు.

## గాంధీలో కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు ప్రారంభం


ఏ ఎం న్యూస్ /హైదరాబాద్ :



పుట్టుకతో వినికిడి లోపం ఉన్న చిన్నారులకు గాంధీ ఆసుపత్రిలో కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు ఆరోగ్యశ్రీ కింద ప్రారంభమయ్యాయి. జీరో–ఐదేళ్ల పిల్లలకు ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. గురువారం తొలి సర్జరీ విజయవంతమైంది. ప్రస్తుతం 40 మంది పిల్లలకు ఆపరేషన్ అవసరం ఉందని, డిసెంబర్‌లోపే పూర్తిచేస్తామని ఈఎన్టీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ భూపేందర్ రాథోడ్ తెలిపారు. రూ.10 లక్షలు ఖర్చయ్యే ఈ ఆపరేషన్ గాంధీలో పూర్తిగా ఉచితం కావడం పేదలకు వరమని వైద్యులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి సేవలు అందిస్తున్నామని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శేషాద్రి, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ మీనాక్షి, డాక్టర్ రెహాన్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో పెట్టుబడుల కోసం జపాన్లో పర్యటించిన డా.పైడి ఎల్లారెడ్డి

ఏ ఎం న్యూస్ ఓయూ:



తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా సఫల ఆర్గానిక్ కంపెనీ సీఈఓ, సైంటిస్టు డాక్టర్ పైడి ఎల్లారెడ్డి జపాన్లో పర్యటిస్తున్నారు. వారం రోజుల పర్యటనలో భాగంగా అక్కడి పలు వ్యాపార, వాణిజ్య సంస్థల సీఈఓలతో సమావేశం అయ్యారు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రం లో పెట్టుబడులకున్న అపారమైన అవకాశాలను అక్కడి ప్రతినిధులకు వివరించారు. దీంతో పాటుగా జపాన్కు చెందిన ఆయిచిన్ ప్రెచ్చర్ గవర్నర్ హిదెకి ఒమురాను తెలంగాణ ప్రభుత్వం తరపున కలిసి తెలంగాణ రాష్ట్రంలో పర్యటించాలనీ అందుకు సంబంధించిన తెలంగాణ ప్రభుత్వ ఆహ్వాన లేఖను అందజేశారు. అనంతరం ఎల్లారెడ్డి తన బృందంతో కలిసి జపాన్ నగోయ రాష్ట్రంలోని స్టార్టప్ సెంటర్ను సందర్శించారు. ఆయిచికెన్లో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన టయోటా మోటార్ కంపెనీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో హిదెకీ ఒమురా మాట్లాడుతూ డాక్టర్ పైడి ఎల్లారెడ్డి చేస్తున్న విశేష సేవా కార్యక్రమాలను కొనియాడారు. అక్కడి దేశ గౌరవార్థం డా. పైడి ఎల్లారెడ్డిని అసెంబ్లీ చైర్మన్ కుర్చీలో కూర్చోబెట్టి గౌరవించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఇన్వెస్ట్మెంట్ ట్రేడ్ డివిజన్ డైరెక్టర్ అతుసుషి సవాడా. వైస్ చైర్పర్సన్ ఐచ్చి పర్ఫెక్చుల్ అసెంబ్లీ ఫ్యూమిహిర్ నంభు, జపాన్ ప్రభుత్వ ఇంటర్నేషనల్ అఫైర్ డివిజన్ కెన్జి తక్కుషిమా తదితరులున్నారు.

# 99లకే రాజు వెడ్స్ రాంబాయి టిక్కెట్

## అమీర్‌పేటలో అర్థనగ్నంగా తిరుగుతా రాజు వెడ్స్ రాంబాయి డైరెక్టర్ సాయిలు




టాలీవుడ్ నుంచి రాబోతున్న తాజా చిత్రం రాజు వెడ్స్ రాంబాయి. ఈ సినిమా శుక్రవారం 21నప్రేక్షకుల ముందుకు రాబోతుం డగా ఈ మూవీపై బంపరాఫర్‌ని ప్రకటించింది చిత్ర యూనిట్. ఈ సినిమా టికెట్ ధరను తగ్గించినట్లు చిత్రబృందం ప్రకటించింది. దీంతో సింగిల్ థియేటర్‌లలో ఈ చిత్రం రూ.99లకే అందు బాటులో ఉండబోతుండగా.. మల్టీప్లెక్స్‌లలో రూ.105గా నిర్ణయిం చినట్లు చిత్రబృందం తెలిపింది. తెలంగాణ రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రంలో అఖిల్, తేజస్విని జంటగా నటిస్తుండగా.. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాను వేణు వుడుగుల నిర్మిస్తుండగా.. బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు.

అఖిల్ రాజ్, తేజస్వి రావు జంటగా నటించిన 'రాజు వెడ్స్ రాంబాయి' నవంబర్ 21న శుక్రవరాం రిలీజ్‌కి సిద్ధం అవుతోంది. ఈటీవీ విన్ ఒరిజినల్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమాకు సాయిలు కంపాటి స్టోరీ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం స్వయంగా నిర్వహించారు. ఇప్పటికే విడుదలైన ప్రతి అప్‌డేట్ మంచి అంచనాలు తీసుకొచ్చింది. అయితే తాజాగా జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సాయిలు చేసిన కామెంట్స్ మాత్రం టాలీవుడ్‌లో పెద్ద చర్చగా మారాయి. మా సినిమా చిన్నదైనా, దాని వెనక ఉన్న ఎమోషన్ చాలా పెద్దది. పల్లెటూరి కథలు, అమాయకమైన ప్రేమ, ఊర్లో జరిగే నిజ జీవిత సంఘటనలు నాకు తెలుసు. నేను విమానం నుంచి దిగి వచ్చే హీరోల కథలు రాయలేదు. మన దగ్గర జరిగిన నిజమైన కథను తీసుకొచ్చా. ఈ సినిమా 15 ఏళ్ల పాటు నరకం చూసిన ఒక జంట నిజ జీవితాన్ని ఆధారంగా చేసుకున్నదని దర్శకుడు చెప్పారు. అలాగే సోషల్ మీడియాలో నెగిటివ్ ప్రచారం చేయొద్దు, సినిమా నచ్చకపోతే వదిలేయండని అభిమానులకు కోరుతూ.. మా టీమ్ ఎంత కష్టపడిందో మీకు సినిమా చూస్తే అర్థమవుతుంది. మన కష్టానికి తగిన ఫలితం తప్పకుండా వస్తుందని అంటూ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే సోషల్ మీడియాలో నెగిటివ్ ప్రచారం చేయొద్దని కోరుతూ.. 'ఈ సినిమాకు నెగిటివ్ టాక్ వస్తే అమీర్‌పేట్ సెంటర్‌లో అర్ధనగ్నంగా తిరుగుతా!' అని ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సినిమా టీమ్ కష్టాన్ని నమ్మి ఇలాంటి ఛాలెంజ్ చేస్తున్నానని చెప్పారు. సాయిలు కంపాటి స్టేట్‌మెంట్ నేపథ్యంలో ఇప్పుడు అందరి దృష్టి సినిమాపైనే పడింది.

# ఎఐ మార్ఫింగ్ ఫోటోలతో నష్టం

## ఆందోళన వ్యక్తం చేసిన నటి కీర్తి సురేశ్



తన పేరుతో ఆన్‌లైన్‌లో సర్కులేట్ అవుతున్న ఎఐ మార్ఫింగ్ చిత్రాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా రూపొందించబడిన ఈ నకిలీ ఫోటోలు తనను మానసికంగా బాధిస్తున్నాయని కీర్తి తెలిపింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది. మార్ఫింగ్ చిత్రాలు నా మనసుకి చాలా బాధ కలిగించడమే కాకుండా.. చాలా విసుగు పుట్టిస్తున్నాయి. ఈ కృత్రిమ మేధస్సుతో క్రియేట్ నకిలీ చిత్రాలు ఎంత నమ్మేలా ఉన్నాయంటే వాటిని చూసినప్పుడు నిజంగానే నేను అలా ఫోజు ఇచ్చానా? అని తనకు తాను ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చిందని కీర్తి పేర్కొన్నారు. ఇది ఎఐ సాంకేతికత ఎంత ప్రమాదకరంగా మారిందో తెలియజేస్తుందని కీర్తి తెలిపారు. ఎఐ సాంకేతికత సామర్థ్యాలు నానాటికీ పెరుగుతున్నాయని వీటిని నియంత్రించడం కష్టంగా మారుతోందని కీర్తి సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. తమ అనుమతి లేకుండా తమ ఇమేజ్‌లను దుర్వినియోగం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని. ఈ సమస్య కేవలం సినీ పరిశ్రమకు మాత్రమే పరిమితం కాలేదని సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఉండే ఎవరికైనా ఇది ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని కీర్తి హెచ్చరించారు. ఇక కీర్తి సురేష్ ఆవేదనకు మద్దతుగా నటి ఆండ్రియా జెరెమియా కూడా ఎఐ వల్ల కలిగే నష్టాల గురించి మాట్లాడారు. నటులకే కాదు, సామాన్య ప్రజలకు కూడా ఎఐ సమస్యగా మారుతోంది. రష్మిక మందన్న, సమంత వంటి పలువురు నటీమణులు కూడా ఇలాంటి డీప్‌ఫేక్ లేదా మార్ఫింగ్ చిత్రాల బారిన పడ్డారు. ఇప్పుడు కీర్తి సురేష్ కూడా దీనిపై గళం విప్పడం, ఎఐ దుర్వినియోగం పై మరింత కఠినమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

# నేడు థియేటర్లలోకి అల్లరి నరేశ్ 12ఎ రైల్వే కాలనీ




టాలీవుడ్ యాక్టర్ అల్లరి నరేశ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న థ్రిల్లర్ ప్రాజెక్ట్ '12ఎ రైల్వే కాలనీ'. నాని కాసరగడ్డ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో డాక్టర్ కామాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ చిత్రం 21న శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అల్లరి నరేశ్ టీం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది.కాగా ఈ సస్పెన్స్ థ్రిల్లర్ ఇంకా థియేటర్లలోకి రాకముందే ఓటీటీ పార్ట్‌నర్‌ను ఫిక్స్ చేసుకుంది. ఈ మూవీ ఓటీటీ రైట్స్‌ను పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియో భారీ మొత్తానికి దక్కించు కున్నట్టు టాలీవుడ్ సర్కిల్ సమాచారం. థియాట్రికల్ రన్ తర్వాత మేకర్స్ ఓటీటీ రిలీజ్ డేట్‌పై క్లారిటీ ఇవ్వనున్నారు. 12ఎ రైల్వే కాలనీలో సాయికుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం, గగన్ విహారి, అనిష్ కురువిల్లా, మధుమణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్న ఈ మూవీకి 'పొలిమేర', 'పొలిమేర 2' ఫేం డాక్టర్ అనిల్‌విశ్వనాథ్ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు సమకూరుస్తున్నారు. క్కువగా కామెడీ సినిమాలెందుకు చేయడం లేదని ప్రమోషన్స్‌లో అల్లరి నరేశ్‌ను ప్రశ్నించగా .. దీనికి అల్లరి నరేశ్ స్పందిస్తూ.. కామెడీ సినిమాలు తీయాలంటే ఇప్పుడు చాలా కష్టతరమైన పరిస్థితులు ఉన్నాయి. మేం ఒకవేళ ఇప్పుడు కితకితలు చేస్తే.. బాడీ షేమింగ్‌తో సినిమాను పక్కన పెట్టేస్తారు. ఇప్పుడు కొన్ని విషయాలు చాలా సున్నితంగా మారాయి. కొంతమంది మనోభావాలు దెబ్బతినే అవకాశముంది. ఈ రోజుల్లో మనం కలర్, బరువుతోపాటు ఇతర సున్నిత అంశాలపై మాట్లాడకూడదన్నాడు. ప్రేక్షకుల అభిరుచి ప్రతీ పది సంవత్సరాల కోసారి మారుతూ వస్తుంది. నేను గతంలో రైమింగ్ డైలాగ్స్, కౌంటర్స్‌తో సాగేకామెడీ సినిమాలు చేసేవాడిని. సుడిగాడు స్పూఫ్ సినిమా.ప్రేక్షకులు కూడా ప్రతీ కంటెంట్‌పై స్పూఫ్స్ చేస్తూ వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. జోకులు ఖచ్చితంగా ఆర్గానిక్‌గా ఉండాలి. వాటిని సోషల్ మీడియా మీమ్స్‌ను నుంచి అస్సలు కాపీ చేయొద్దు. జనాలు ఇప్పుడు ఆర్గానిక్‌గా ఉండే సెన్సిబుల్ కామెడీని ఆశిస్తున్నారని చెప్పుకొచ్చాడు అల్లరి నరేశ్.

# కళ్యాణి ప్రియదర్శి కొత్త చిత్రం ప్రారంభం



కళ్యాణీ ప్రియదర్శన్ ఇవాళ మలయాళ చిత్ర సీమలో స్టార్ హీరోయిన్. అగ్ర కథానాయకుల సినిమాలను మించి పోయి... ఆమె నటించిన 'లోకా' పార్ట్ వన్ మూడు వందల కోట్లకు పైగా గ్రాస్ ను వసూలు చేసింది. దీంతో ఒక్కసారిగా సెట్స్ మీద ఉన్న ఆమె సినిమాలకు క్రేజ్ పెరిగిపోయింది. ప్రస్తుతం కార్తీ సరసన 'మార్షల్' సినిమాలోనూ, 'జయం' రవి 'జీనీ'లోనూ ఆమె నటిస్తోంది. అలానే 'లోకా' మూవీ సక్సెస్ తర్వాత కళ్యాణీ ప్రియదర్శన్ తో సినిమా తీయడానికి చాలామంది మేకర్స్ తహతహలాడుతున్నారు. ఇదిలా ఉంటే... పొటెన్షియల్ స్టూడియోస్ సంస్థ తన ఏడో సినిమాను కళ్యాణ్ ప్రియదర్శన్ తో మొదలు పెట్టింది. గతంలో 'మాయ, మానగరం, మాన్ స్టర్, తానక్కరన్, ఇరుగపాత్రు, బ్లాక్' వంటి విజయవంతమైన సినిమాలను ఈ నిర్మాణ సంస్థ రూపొందించింది. ఈ సినిమాలో 'నాన్ మహానల్లా' ఫేమ్ దేవదర్శిని, వినోద్ కిషన్ కీలక పాత్రలు పోషించబోతున్నారు. ఈ మూవీతో ధీరవియం ఎస్.ఎన్. దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ప్రవీణ్ భాస్కర్, శ్రీకుమార్ దీనికి దర్శకుడితో కలిసి స్క్రీన్ ప్లే, సంభాషణలు అందిస్తున్నారు. జస్టిన్ ప్రభాకరన్ సంగీతం అందిస్తుండగా, గోకుల్ బెనోయ్ సినిమాటోగ్రాఫర్ గా వ్యవహరిస్తున్నారు. ఎస్.ఆర్. ప్రకాష్ బాబు, ఎస్.ఆర్. ప్రభు, పి. గోపీనాథ్, తంగప్రభహరన్ ఆర్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చెన్నైలో పూజా కార్యక్రమాలతో బుధవారం ప్రారంభమైంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ త్వరలోనే ప్రకటించనున్నారు.

mana Cinemalu

# రజనీకి హెచ్‌టి అత్యున్నత గౌరవం

## 50 ఏళ్ల సినీ ప్రస్థానంపై ఫ్రంట్ పేజీలో ఫోటో



అగ్ర కథానాయకుడు రజనీకాంత్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ ఆంగ్ల పత్రిక హిందుస్థాన్ టైమ్స్ ఫ్రంట్ పేజీలో ఆయన ఫొటోను ముద్రించారు. ఈ పత్రిక స్థాపించిన వందేళ్లలో ఇలా ఒక పేజీ మొత్తం హీరో ఫొటోను ముద్రించడం తొలిసారి కావడం విశేషం. రజనీకాంత్ ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా హిందుస్థాన్ టైమ్స్ తలైవాను ఇలా గౌరవించింది. సినీ ఇండస్ట్రీని ఎంతో ప్రభావితం చేసిన వ్యక్తికి ఇలాంటి గౌరవాన్ని కల్పించడం ఆనందంగా ఉందని పత్రిక పేర్కొంది. నవంబర్ 19న పేపర్‌లో రజనీ ఫొటో చూసి పాఠకులు ఆశ్చర్యపోయారు. ఇది ఆయనకు ఇచ్చిన గొప్ప గౌరవం అంటూ ఆనందం వ్యక్తంచేశారు. దీనిపై రజనీకాంత్ కూడా స్పందించారు. అద్భుతమైన సర్‌ప్రైజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన హృదయం ఆనందంతో నిండిపోయిందన్నారు. తనపై చూపుతోన్న ప్రేమాభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. 1975లో 'అపూర్వ రాగంగళ్'తో సినీ రంగప్రవేశం చేసిన రజనీకాంత్ ఎన్నో హిట్ సినిమాల్లో నటించి తన స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కోట్ల మంది అభిమానులను సొంతం చేసుకున్నారు. ఈ నెలలో గోవా వేదికగా జరగనున్న 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి - 2025) ముగింపు వేడుకల్లో రజనీకాంత్‌ను సన్మానించనున్నారు.

# చిరాకు పుట్టిస్తున్న ప్రీరిలీజ్ ఈవెంట్లు

## అవసరానికి మించి పొగడ్తలు అవసరమా

## నటుడు, దర్శకుడు రవిబాబు



తనకు సినిమాలు మార్కెటింగ్ చేసుకోవడం రాదని నటుడు, దర్శకుడు రవిబాబు తెలిపారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లు చిరాకు తెప్పిస్తాయన్నారు. అలాంటి ఈవెంట్‌లు పెట్టి నటీనటులను అవసరానికి మించి పొగుడుతూనే ఉంటారని అలా ఎందుకు చేస్తారో ఇప్పటికీ తనకు అర్థం కాదన్నారు. అందుకే తాను ఈవెంట్‌లకు రానని చెప్పారు.కొన్ని సినిమాల్లో నన్ను విలన్‌గా చూసినవారు ఇప్పటికీ నేను ఎదురుగా కనిపిస్తే భయంతో వెళ్లిపోతున్నారు. సినిమాలు ప్రేక్షకులపై అంతగా ప్రభావం చూపుతాయి. అందుకే సున్నితమైన అంశాలను తెరకెక్కించేటప్పుడు మరింత జాగ్రత్త వహించాలని రవిబాబు చెప్పారు. తనకు మార్కెటింగ్ చేసుకోవడం తెలియదని దర్శకుడు రవిబాబు అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. హాస్యం కూడా ప్రాంతాన్ని బట్టి మారుతుందన్నారు. అందుకే తాను ఎక్కువగా విజువల్స్‌కు ప్రాధాన్యం ఉండేలా చూస్తానన్నారు. 'అవును సినిమాలో ఆ హీరోయిన్ పెద్ద ఇబ్బందుల్లో పడుతుంది. దాన్ని విజువల్‌గా ఎలా చూపించాలి అని ఆలోచించి.. ఏనుగు పెద్ద జంతువు కాబట్టి ఏనుగంత ప్రాబ్లమ్‌లో హీరోయిన్ ఉంది అని చెప్పడం కోసం పోస్టర్ చేయించా. ఆ పోస్టర్ చూసి ఒక వ్యక్తి నాకు ఫోన్ చేసి తిట్టాడు. ఏనుగు ఉందని పిల్లల్ని తీసుకొని సినిమాకు వెళ్తే సినిమాలో ఏనుగు లేదన్నాడు. ఆయనకు సారీ చెప్పి పెట్టేశాను. ఈ సినిమా చూసి మరో మహిళ ఫోన్ చేశారు. శరీరం లేని వ్యక్తి, కళ్లకు కనిపించని వ్యక్తి హీరోయిన్‌ను ఎలా కలవాలని అనుకుంటాడు అని నాతో వాదించారు. ఆమెకు నేను ఆ సినిమా కథే అది అని వివరించలేకపోయాను'. 'ప్రేక్షకులు మనం తీసే సినిమాలను క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ప్రతి విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలి.

# జయకృష్ణ మూవీకి జివి ప్రకాశ్ సంగీతం



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేశ్ బాబు తనయుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్న విషయం తెలిసిందే. జయకృష్ణను హీరోగా పరిచయం చేస్తూ ప్రముఖ నిర్మాత అశ్వినీదత్ సమర్పణలో 'జెమినీ' కిరణ్ మూవీని ప్రొడ్యూస్ చేస్తున్నారు. దీనికి 'ఆర్.ఎక్స్. 100' ఫేమ్ అజయ్ భూపతి దర్శకుడు. అజయ్ భూపతి 'ఆర్.ఎక్స్. 100' తర్వాత 'మహాసముద్రం', 'మంగళవారం' చిత్రాలను రూపొందించారు. దర్శకుడిగా ఇది ఆయనకు నాలుగో సినిమా. జయకృష్ణ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో అతని సరసన ప్రముఖ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ హీరోయిన్ గా నటిస్తోంది. గతంలో రవీనా టాండన్ పలు తెలుగు చిత్రాలలో హీరోయిన్ గా చేసింది. రాషాకు మాత్రం ఇదో తొలి తెలుగు సినిమా. ఇక తాజాగా ఈ సినిమాకు జీవీ ప్రకాశ్ కుమార్ ను సంగీత దర్శకుడిగా ఎంపిక చేసినట్టు మేకర్స్ తెలిపారు.అజయ్ భూపతి గతంలో దర్శకత్వం వహించిన సినిమాలకు చైతన్ భరద్వాజ్, అజనీశ్ లోకనాథ్ సంగీతం అందించారు. జీవీ ప్రకాశ్ కుమార్‌తో అజయ్ భూపతి వర్క్ చేయడం ఇదే మొదటిసారి. గడిచిన 19 సంవత్సరాలలో జీవీ ప్రకాశ్ కుమార్ వందకు పైగా సినిమాలకు సంగీతాన్ని అందించాడు. తెలుగులోనూ పలు చిత్రాలకు స్వరాలు సమకూర్చాడు. అయితే జయకృష్ణ హీరోగా పరిచయం కాబోతున్న సినిమాకు అతను సంగీతాన్ని అందించడం ప్రత్యేకతను సంతరించుకుంది. మరి ఈ సినిమా ఏ స్థాయిలో మ్యూజికల్ హిట్ గా నిలుస్తుందో చూడాలి.